విద్యుత్ లో ఓల్టేజీ నివారణకు చర్యలు


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ హరిబాబు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులోని వివిధ కాలనీల్లో విద్యుత్ లో ఓల్టేజీ సమస్య నివారణకు విద్యుత్ అధికారుల సహకారంతో చర్యలు తీసుకుంటున్నామని కౌన్సిలర్ పంగ హరిబాబు అన్నారు. శనివారం 18వ వార్డులోని సాయి సంజీవకాలనీలో లో ఓల్టేజీ నివారణకు కొత్తగా ఏర్పాటు చేసిన అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. విద్యుత్ లైన్‌మెన్, శ్రీకాంత్, నవీన్‌బాబు, కాలనీ అధ్యక్షుడు విజయ్, ధనుంజయ్, లక్ష్మీప్రసాద్, రమేష్, కిషోర్, చందన్, రమేష్‌బాబు, కిరణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం.. పుణ్యకార్యం



కీసర: భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న చీర్యాల లక్ష్మీనృసింహ్మ స్వామి ఆలయంలో ప్రతి శనివారం భక్తులకు అన్నదానం ఉంటుందని ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం దేవాలయంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేవాలయానికి వచ్చే భక్తులు అన్నదాన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాజీ ఎంపీపీ మల్లారపు ఇందిర, ధర్మకర్త శ్రీహరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి హుండీ వితరణ


హుండీ అందజేసిన రామిడి ప్రభాకర్‌రెడ్డి

కీసర: మండల కేంద్రమైన కీసరలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయానికి పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి హుండీని విరాళంగా సమర్పించారు. శనివారం దేవాలయం వద్ద ప్రభాకర్‌రెడ్డి విరాళంగా అందజేసిన హుండీకి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. మాజీ ఉప సర్పంచులు బలిదేరమేష్ గుప్తా, రాయిల శ్రావణ్‌కుమార్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గుర్రం లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు


శుభాకాంక్షలు చెబుతున్న దృశ్యం

ఘట్‌కేసర్: తెలంగాణ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ నూతన చైర్మన్‌గా శ్రీకాంత్‌గౌడ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆయన చాంబర్‌లో శనివారం కలిశారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బీసీల వర్గాల అభివృద్ధికి సహకరించాలని అనంతరం చైర్మన్‌ను కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ పవన్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు రవిముదిరాజ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మోహన్, రాజేందర్‌గౌడ్, నరేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

సరికొత్త ఆలోచనలకు 'ప్రాజెక్ట్ ఎక్స్‌పో'


ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో పాల్గొన్న విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ కళాశాలలో శనివారం ప్రాజెక్ట్ ఎక్స్‌పో నిర్వహించారు. బడ్ టూ బిజినెస్ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో 89 విద్యార్థి బృందాలు పాల్గొని తమ ఆలోచనలను ఆవిష్కరించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన 3 జట్లకు కళాశాల చైర్మన్ గోపాల్‌రెడ్డి, సీఈఓ అభినవ్‌రెడ్డి నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ, దేవదాస్, సురేశ్‌రాం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ రాజశేఖర్‌కు బెస్ట్ సోషల్ వర్క్ అవార్డు



పోచారం: మున్సిపాలిటీలోని 3వ వార్డు కౌన్సిలర్ చింతల రాజశేఖర్‌కు బెస్ట్ సోషల్ వర్క్ అవార్డు లభించింది. జాతీయ మానవ హక్కులు, వినియోగదారుల సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్ అందించిన సేవలకుగాను ఈ అవార్డును సమితి శనివారం ప్రదానం చేసింది. సమితి 8వ వార్షికోత్సవ కార్యక్రమంలో హైకోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ చంద్రకుమార్ చేతుల మీదగా అవార్డును రాజశేఖర్ అందుకున్నారు.

చెంగిచెర్లలో ఆగస్టు 4న బోనాలు

బోడుప్పల్: చెంగిచర్లలో ఆగస్టు 4వ తేదీన బోనాల ఉత్సవాలను నిర్వహించేందుకు గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఈ మేరకు శనివారం పోచమ్మ దేవాలయంలో సమావేశమై వైభవంగా నిర్వహించేందుకు తీర్మానించారు. కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, బింగి జంగయ్యయాదవ్, కో- ఆప్షన్ సభ్యులు రంగ బ్రహ్మన్నగౌడ్, మాజీ ఉపసర్పంచ్ కొత్త రవిగౌడ్, మాజీ వార్డు సభ్యులు కొత్త ప్రభాకర్‌గౌడ్, కుర్రి శివశంకర్, నేతలు కొత్త గోపాల్‌గౌడ్, ఏర్పుల మహేష్ తదితరులున్నారు.

'ఆపరేషన్ ముస్కాన్–10'..

బాలల సంరక్షణే లక్ష్యం

- పరిశ్రమలు, బట్టీలు, దుకాణాల్లో కొనసాగుతున్న తనిఖీలు
- రంగంలో ప్రత్యేక తనిఖీ బృందాలు
- ఇప్పటి వరకు 91 మంది గుర్తింపు
- బృందాల్లో పోలీసు, కార్మిక, సంక్షేమ తదితర శాఖల అధికారులు
- నెలాఖరు వరకు తనిఖీల నిర్వహణ



ఆపరేషన్ ముస్కాన్‌పై అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారి కృష్ణారెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: బడికెళ్లి ఆటపాటలతో చదువుకోవాల్సిన బాలలు బతుకుదెరువు కోసం పరిశ్రమల్లోకి వెళ్తున్నారు. పలకా బలపం పట్టుకోవాల్సిన చిట్టి చేతులు.. బట్టీల్లో ఇటుకలు మోస్తున్నాయి.. హోటళ్లలో పాత్రలను శుభ్రం చేస్తున్నాయి. ఆర్థిక పరిస్థితులు, కుటుంబ కారణాలేవైనా.. బాల్యం ఛిద్రమవుతోంది.. బంగారు భవితను చిదిమేస్తోంది. వీటిని గుర్తించి బాలల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ సత్ఫలితాలిస్తోంది. ఇప్పటివరకు తొమ్మిదిసార్లు నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా బాల కార్మికులుగా పనిచేస్తున్న ఎంతో మందిని బడిలో చేర్పించారు. ప్రస్తుతం 'ఆపరేషన్ ముస్కాన్-10'లో కొత్త కార్యాచరణతో ముందుకెళ్తున్నారు.

పని ప్రదేశాల్లో...

- బాల కార్మికులు ఎక్కడైనా కనిపిస్తే చైల్డ్ లైన్ బడీడు పిల్లలు పనులకు వెళ్లకుండా, పాఠశాలలో విద్య అభ్యసించాలని సర్కారు ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. ఇందులో భాగంగా వివిధ ప్రాంతాల్లో పనులు చేస్తున్న చిన్నారులను గుర్తించి పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏటా రెండు సార్లు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పిల్లలను పనుల్లో పెట్టుకోవద్దని పరిశ్రమలు, ఇటుకబట్టీలు, హోటళ్లు, కిరాణం, షాపింగ్ మాల్స్, పారిశ్రామిక వాడలు, వస్త్ర వ్యాపారులు తదితరులకు అవగాహన కల్పిస్తున్నా.. వారిలో మార్పు రావడంలేదు. కొందరు వారిని పనుల్లో నియమించుకుంటున్నారు. వీరిలో కొందరు తప్పిపోయిన వారు ఉంటున్నారు. వీరికి విముక్తి కల్పించేందుకు ఆపరేషన్ ముస్కాన్ కొనసాగుతోంది.
- ఆర్థిక ఇబ్బందుల కారణంగా బస్తీలు,పల్లెలు, తండాలు, గిరిజన ప్రాంతాలకు చెందిన వారు తమ పిల్లలను వివిధ ప్రదేశాల్లో పని చేసేందుకు నియమిస్తున్నారు.
- 18 ఏళ్లలోపు చిన్నారులతో పని చేయించడం చట్టరీత్యా నేరం. అయినా పరిశ్రమలు, షాపింగ్ మాల్స్, ఇటుక బట్టీలు, కార్మిక వాడలు, మెకానిక్ షెడ్లు, భవన నిర్మాణ ప్రదేశాలు, హోటళ్లు, ఇతర దుకాణాల్లో వారే కనిపిస్తున్నారు. బాలకార్మికులను గుర్తించి విముక్తి కల్పించేందుకు ప్రభుత్వ ఏటా జనవరిలో ఆపరేషన్ స్మైల్, జులైలో ఆపరేషన్ ముస్కాన్ పేరిట కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ప్రస్తుతం పదో విడత ముస్కాన్ ఈ నెలాఖరు వరకు కొనసాగనుంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటి వరకు పనిలో ఉన్న 91 మందిని గుర్తించారు. ఇందులో 22 మందిని చిల్డ్రన్స్‌హోమ్‌లో చేర్పించగా, 69 మందిని వారి తల్లిదండ్రులకు అప్పగించారు. జిల్లాలో మొత్తంగా ఆరు ప్రత్యేక బృందాలు తనిఖీల కార్యక్రమంలో పాల్గొంటున్నాయి.
- సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని బాలానగర్, పేట్‌బాషీర్‌బాగ్, కూకట్‌పల్లి, మేడ్చల్‌లలో 4 బృందాలు, రాచకొండ పరిధిలో మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్‌ల్లో 2 బృందాలు ఈ నెల 31 వరకు ఆయా ప్రాంతాల్లోని పని ప్రదేశాలు, పరిశ్రమలు, పారిశ్రామిక వాడలు, ఇటుక బట్టీలు, హోటళ్లు, దుకాణాలను తనిఖీ చేయనున్నారు. గుర్తించిన వారి వివరాలను తెలుసుకుని తల్లిదండ్రులుంటే వారికి అప్పగిస్తున్నారు. లేకపోతే బాల సంరక్షణ కేంద్రాల్లో వసతి కల్పిస్తున్నారు.

ఫిర్యాదు చేయాలంటే...

చిన్నారుల బంగారు భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. మీరంటున్న ప్రాంతం, సందర్భమేదైనా, ఎక్కడికైనా వెళ్లినప్పుడు ఆ సమయంలో బాల కార్మికులు కనిపిస్తే.. వారికి విముక్తి కలిగించేలా చూడాలి. వెంటనే చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నంబర్: 1098కు ఫోన్ చేయాలి. తద్వారా సంబంధిత శాఖ అధికారులకు సమాచారం చేరుతుంది. వివరాలు గోప్యంగా ఉంటాయి. పోలీసు సహాయ కేంద్రం 100 నంబరుకు ఫిర్యాదు చేయవచ్చు. కార్మిక, సంక్షేమ శాఖ అధికారులు, తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం ద్వారా బాల కార్మికులను బడుల్లో చేర్పించే వీలుంటుంది.

హాట్ స్పాట్‌పై ప్రత్యేక నిఘా...

బాల కార్మికులు ఎక్కువగా ఉండే ప్రాంతాలను హాట్ స్పాట్లుగా గుర్తించారు. వాటిపై ప్రత్యేక నిఘా పెట్టారు. అధికారులు గుర్తించిన ప్రాంతాల వద్ద పరిశీలన చేస్తారు. పిల్లలను పనిలో పెట్టుకున్న యజమానులకు అవగాహన కల్పిస్తారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలుంటాయని హెచ్చరిస్తున్నారు.

ప్రత్యేక బృందాలుగా విధులు...

- జిల్లా వ్యాప్తంగా ఆరు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి. ఒక్కో బృందంలో ఎస్ఐ, కానిస్టేబుళ్లు, స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారి, సిబ్బంది, విద్యా, వైద్య, కార్మిక శాఖ అధికారులు సభ్యులుగా ఉంటారు. ఈ బృందాలు ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. భిక్షాటన చేస్తున్న వారు, తప్పిపోయిన చిన్నారులు, బస్, రైల్వే స్టేషన్లు, ఇతర ప్రదేశాల్లో వీధి, అనాథ, బాలలను గుర్తించి తల్లిదండ్రుల చెంతకు చేరుస్తున్నారు. బాలకార్మికులు, బడి మానేసిన, చెత్త సేకరించే, మతి స్థిమితం లేని వారిని కూడా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నారు.
- అలా కుదరకపోతే వసతి గృహాల్లో సీటు ఇప్పించి పాఠశాలల్లో చేర్పించేందుకు చొరవ చూపుతున్నారు.
- బాల్య వివాహాలు అడ్డుకోవడంతో పాటు అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనే చిన్నారులను గుర్తించి సంరక్షిస్తారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే యజమానులు. నిర్వాహకులపై పోలీసు, కార్మికశాఖ అధికారులు కేసులు నమోదు చేస్తారు. అనాథ బాలల సంరక్షణలో భాగంగా సీడబ్ల్యూసీ (బాలల సంక్షేమ సమితి) ఎదుట హాజరుపరుస్తారు. వారి ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటారు.



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

పటిష్టంగా అమలు చేస్తున్నాం

చిన్నారులను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవు. వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలి. జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ పటిష్టంగా అమలు చేస్తున్నాం. జిల్లాలో ఇప్పటి వరకు పనిలో ఉన్న 91 మందిని గుర్తించాం. ఇందులో 22 మందిని చిల్డ్రన్స్ హోమ్‌లో చేర్పించగా, 69 మందిని వారి తల్లిదండ్రులకు అప్పగించాం. ఈ నెలాఖరు వరకు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని కొనసాగిస్తాం.

- కృష్ణారెడ్డి, జిల్లా మహిళా, శిశు, వృద్ధుల సంక్షేమ శాఖ అధికారి, మేడ్చల్-మల్కాజిగిరి

మీరాలం కుంటలో గుర్రపు డెక్క తొలగింపు

పోచారం: అన్నోజిగూడలోని మీరాలం కుంటలో పేరుకు పోయిన చెత్తచెదారాలతో పాటు గుర్రపు డెక్కను శనివారం తొలగించారు. పనులను చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇన్ఫోసిస్ సౌజన్యంతో కుంటను ప్రక్షాళన చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఇన్ఫోసిస్ ప్రతినిధులు మాట్లాడుతూ.. మున్సిపల్ కౌన్సిల్ అభ్యర్థన మేరకు మురుగు నీటి ఔట్‌లెట్‌ను కూడా సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ పశ్య వేమనరెడ్డి, కౌన్సిలర్ గొంగళ్ల మహేష్, నాయకులు నల్లవెల్లి శేఖర్, ఆకిటి బాల్‌రెడ్డి, ఇన్ఫోసిస్ ప్రతినిధులు వెంకటేశ్, సంగం, వంశీ, విజయరాఘవన్, కార్తీక్, రాజశేఖర్, లక్ష్మి, పద్మావతి, యశ్వంత్, హేమంత్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కుంటను ప్రక్షాళన చేస్తున్న సిబ్బంది

బంధువుల ఇంటికొచ్చాడు.. చైన్ స్నాచరయ్యాడు

నిందితుడిని రిమాండ్ తరలించిన పోలీసులు


నిందితుడు వెంకటేశ్

ఘట్‌కేసర్: బంధువుల ఇంటికొచ్చి సంతలో బంగారం, వెండి గొలుసు లాక్కున్న నిందితుడిని ఘట్‌కేసర్ పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సైదులు సమాచారం మేరకు... రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌కు చెందిన అజ్మీరా వెంకటేశ్(25) శుక్రవారం ఘట్‌కేసర్‌లో బంధువు బుడ్డ బాలయ్య ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చాడు. ఎదులాబాద్ రోడ్డులో శుక్రవారం జరిగిన కూరగాయల వారం సంతలో అంబేద్కర్‌నగర్‌కు చెందిన ధనుంజయ తన కుటుంబ సభ్యులతో కలిసి కూరగాయల కోసం వచ్చాడు. కూరగాయలు తీసుకుంటుండగా వర్షం రావడంతో సమీపంలోని పశువుల ఆస్పత్రి పక్కన నిలుచున్నాడు. అదే సమయంలో అజ్మీరా వెంకటేశ్ అక్కడికి వచ్చి అకారణంగా ధనుంజయ్‌తో గొడవ పెట్టుకొని దాడి చేశాడు. మెడలో ఉన్న 13 గ్రాముల బంగారు, 20 గ్రాముల వెండి గొలుసు లాక్కొని పరారయ్యాడు. దీంతో బాధితుడు పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. విశ్వసనీయ సమాచారంతో వెంకటేశ్‌ను ఆయన నివాసంలో శనివారం అదుపులోకి తీసుకొని విచారించగా బంగారు, వెండి గొలుసు లాక్కున్నట్లు ఒప్పుకున్నాడు. ఇంటిలో దాచిన ఆభరణాలను సాక్షుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడు వెంకటేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్లాటు విక్రయిస్తామని డబ్బు తీసుకొని మోసం

ప్లాటు యజమానికి సంబంధం లేకుండా డబ్బు తీసుకున్న వైనం


మీరాల గణేశ్, ఎదులాబాద్


వల్లపు మహేశ్, ఘట్‌కేసర్ బుగ్గానగర్

ఘట్‌కేసర్: ప్లాటు విక్రయిస్తామని యజమాని అనుమతి లేకుండా డబ్బులు తీసుకొని మోసం చేసిన వ్యక్తులను ఘట్‌కేసర్ పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సైదులు సమాచారం మేరకు... ఎదులాబాద్‌కు చెందిన మీరాల గణేశ్(42), ఘట్‌కేసర్ బుగ్గానగర్‌కు చెందిన వల్లపు మహేశ్(32), మక్కల శ్రీకాంత్, ఎంకిర్యాల్‌కు చెందిన యాకరి గణేశ్ కలిసి చౌదరిగూడకు చెందిన గొట్టి పాముల సుదర్శన్‌కు కేశవ్‌నగర్ వెంచర్‌లోని 215బి ప్లాటును విక్రయిస్తామని ప్లాటు యజమాని అనుమతి లేకుండా రూ. 9.8 లక్షలు అడ్వాన్స్ తీసుకున్నారు. అగ్రిమెంట్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేయాలని కోరగా కాలయాపన చేయసాగారు. దీంతో సుదర్శన్ విచారణ చేయగా నలుగురు వ్యక్తులు ప్లాటు యజమాని నుంచి ఎలాంటి విక్రయ ఒప్పందం చేసుకోకుండా మోసగించారని తేలింది. ప్లాటును ఒప్పందం చేసుకున్నామని తప్పుడు సమాచారంతో మోసం చేశారని, తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని బాధితుడు సుదర్శన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు దర్యాప్తు చేసిన పోలీసులు మీరాల గణేశ్, వల్లపు మహేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు నిందితులు మక్కల శ్రీకాంత్, యాకరి గణేశ్ పరారీలో ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



మేడ్చల్‌రూరల్: మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో మండలంలోని పూడూర్ గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన వైద్య శిబిరంలో గ్రామస్తులకు వైద్యులు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌ను కలిసిన నాయకులు


పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంజీవరెడ్డి, కార్తీక్‌యాదవ్

ఘట్‌కేసర్: తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ నూతన చైర్మన్‌గా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మండల అధ్యక్షుడు వినోద్, సత్తిరెడ్డి, కార్తీక్‌యాదవ్, సాయిచరణ్ రెడ్డి ఆయన కార్యలయంలో శనివారం కలిశారు. అనంతరం శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

నారపల్లిలో సీసీ రోడ్డు పనుల పరిశీలన


రోడ్డు పనులను పరిశీలిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: నారపల్లిలోని ఎంఎస్ఆర్‌నగర్ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వీకర్ సెక్షన్ కాలనీలో సుమారు రూ. 10 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు చెప్పారు. అన్ని వార్డుల్లో దశల వారీగా మౌలిక వసతులు మెరుగు పరుస్తున్నామన్నారు. స్థానిక నాయకులు సుర్వి శ్రీనివాస్‌గౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రంగనాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికతో ముందుకు సాగాలి


విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: విద్యార్థి జీవితాన్ని ముగించుకుని వృత్తి జీవితంలో అడుగుపెడుతున్న విద్యార్థులు తమకు ఎదురయ్యే ఒడిదుడుకులను అధిగమించేందుకు ప్రణాళికతే ముందుకు సాగాలని మేడ్చల్ ఎమ్మెల్యే, మల్లారెడ్డి విద్యాసంస్థల చైర్మన్ మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(మెయిన్ క్యాంపస్)లో శనివారం 19వ గ్రాడ్యుయేషన్ డే తో పాటు క్యాంపస్ ప్లేస్‌మెంట్, పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మల్లారెడ్డి మాట్లాడుతూ... వినూత్నమైన ఆలోచనా విధానం, నూతన ఆవిష్కరణలు, ప్రణాళిక విజయానికి మూలసూత్రాలు అని వివరించారు. పట్టాలు అందుకున్న విద్యార్థులు ఆకాశమే హద్దుగా భావించాలని, సవాళ్లను అధిగమించి ఉన్నత స్థానాల్లో నిలవాలని కోరారు. అనంతరం ఉత్తమ విద్యార్థులకు మెడల్స్ అందజేసి విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. సర్వీస్ నౌ సంస్థ సంచాలకులు భాస్కర్, ఫాక్ట్ సెట్ సంస్థ ఉపాధ్యక్షురాలు అనుపమ రంజన్, కళాశాల ప్రిన్సిపాల్ రామస్వామిరెడ్డి, సాక్ కో ఆర్డినేటర్లు సరోజిని, బాలాజీ కృష్ణ, సంధ్య, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకుంటే లక్ష్య సాధన



విద్యార్థులకు పట్టాలరు ప్రదానం చేస్తున్న సమరత్ ఆర్య

మేడ్చల్‌రూరల్: విద్యార్థులు ఎంచుకున్న రంగంలో మంచి నైపుణ్యాలతో పనిచేస్తే లక్ష్యాలను సాధించవచ్చని అడోబి యూనివర్సిటీ టాలెంట్ పార్ట్నర్ సమరత్ ఆర్య, సెయింట్ పీటర్స్ కళాశాల చైర్మన్ బాలరెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల 14వ గ్రాడ్యుయేషన్ డే శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో శాంత ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంను ప్రారంభించారు. ఇంజినీరింగ్ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులు ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలు సృష్టించే స్థాయి చేరాలని పిలుపునిచ్చారు. కళాశాల విద్యను పూర్తి చేసుకుని బయటికి వెళ్తున్న విద్యార్థులు పుస్తకాలను, లైబ్రరీని మాత్రం వదలవద్దన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టి.వి.రెడ్డి, పీపుల్ కల్చర్ వెల్బీస్ అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, డైరెక్టర్లు అనురాగ్‌రెడ్డి, సరోజారెడ్డి, పీఆర్వో రవిసుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలి


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్

ఘట్‌కేసర్: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిన్న అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థులు కోర్సులు పూర్తి చేసినా పై చదువులు, ఉద్యోగాలకు వెళ్లడానికి కళాశాల యాజమాన్యం ధ్రువపత్రాలు ఇవ్వడం లేదన్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేపోతున్నామని, వేతనాలు చెల్లించలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని, లేని పక్షంలో విద్యార్థులకు న్యాయం జరిగే ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అన్వర్, ఉపాధ్యక్షుడు హరీశ్, నాయకులు హరీశ్, అజయ్, మహేశ్, ప్రశాంత్, సిద్ధార్థ, శ్రీరామ్, శ్రీకాంత్, ఆకాశ్, వెంకట్, రాము పాల్గొన్నారు.